క్లుప్తంగా

30 నుంచి మాఘ మాస ఉత్సవాలు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి మాఘ మాస ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గురువారం నుంచి మొదలుకొని నెల రోజుల పాటు ఫిబ్రవరి 28 వరకూ ఉత్సవాలు జరుగుతాయన్నారు. నెల రోజుల్లో ప్రతి ఆదివారం తిరునాళ్లకు అధిక సంఖ్య భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగ్గట్టుగా ఏర్పాటు చేశామన్నారు. ఫిబ్రవరి 2, 9, 16, 23వ తేదీల్లో మాఘ ఆదివారాలు వచ్చాయని, వీటితో పాటు 4న రథ సప్తమి, 8న భీష్మ ఏకాదశి పర్వదినాల్లో అధిక సంఖ్యలో భక్తులు వస్తారన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కరపలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు

కరప: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు స్థానిక నాయకులతో కలసి సోమవారం కరపలో పర్యటించారు. ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సలాది వెంకన్న అల్లుడు సిద్ధా శశాంకమౌళి ఇటీవల మరణించారు. బాధిత కుటుంబ సభ్యులు వెంకన్న, మనోజ్ తదితరులను కన్నబాబు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, పీఏసీఎస్ విశ్రాంత సీఈఓ చోడపునీడి వెంకటరమణ, పార్టీ నాయకులు నక్కా సత్తిబాబు, గొర్రెల శ్రీనివాస్, ముద్రగడ వీరబాబు, గంధం బాబులు, కొత్త రవి, బేరీ కృష్ణమూర్తి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నడకుదురులో పశువులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న పశు వైద్యాధికారి రవికిరణ్

కరప: పశువులు, మేకలు, గొర్రెలలో వచ్చే వ్యాధుల నివారణకు నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి ఎం.రవికిరణ్ అన్నారు. నడకుదురులోని పశు వైద్యశాలలో సోమవారం పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలను వివరించారు. పశు సంవర్ధక శాఖ ద్వారా నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో 200 ఆవులు, పాడి గేదెలకు వెటర్నరీ అసిస్టెంట్లతో కలసి పరీక్షలు చేశామన్నారు. జలగ నివారణ మందులు, 125 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు స్థానిక నాయకులతో కలసి అందజేశారు.

క్యాట్ ఒలింపియాడ్‌లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థుల బృందంతో యాజమాన్యం

బాలాజీచెరువు: స్థానిక సాంబమూర్తినగర్ శ్రీచైతన్య ఐపీఎల్ స్కూల్ విద్యార్థులు క్యాట్ ఒలింపియాడ్ స్థాయి–2 పరీక్షలో ప్రతిభ చూపారని పాఠశాల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎంవీ సురేష్ సోమవారం తెలిపారు. ప్రతిభ చూపిన వారిలో 11 మంది నగదు ప్రోత్సాహక బహుమతి సాధించగా, 53 మంది మెడల్స్, ప్రశంసా పత్రాలు పొందారని అన్నారు. విద్యార్థుల బృందాన్ని ఆర్ఐ గోపీనాథ్, కో ఆర్డినేటర్ జనార్దన్, ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, డీన్ సత్యనారాయణ అభినందించారు.

సైన్స్ అధికారికి సత్కారం

బాలాజీచెరువు: యంగ్‌మైండ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ అధికారి వినీల్ దంపతులను సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సత్కరించారు. సైన్స్ ప్రదర్శనలో జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న వినీల్‌ను సత్కరించడం సంతోషంగా ఉందని సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ అన్నారు. కౌన్సల్ కో ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

30 నుంచి మాతంగి హోమాలు

బోట్‌క్లబ్: వేద విజ్ఞాన ప్రతిష్టానం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 7 వరకూ మాతంగి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహించనున్నట్లు ప్రతిష్టానం ప్రతినిధి పుసులూరి ఫణిశర్మ తెలిపారు. రోజూ ఉదయం హోమాలు ఉంటాయన్నారు. రామారావు పేట యూనియన్ బ్యాంక్ పక్కన ప్రతిష్టానం కార్యాలయంలో ఈ విశేష పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

కాళ్ల కింద కరకర



దుమ్ములపేట నుంచి కుంభాభిషేకం వెళ్లే రోడ్డులో రేగుతున్న దుమ్ము



దుమ్ములపేట నుంచి కుంభాభిషేకం రోడ్డుపై తేలిన రాళ్లు

- రహదారిపై మిగిలిన రాళ్లు
- మొక్కుబడిగా కుంభాభిషేకం రోడ్డులో పనులు
- చిన్నపాటి గుంతల పూడ్చివేతతో సరి

కాకినాడ రూరల్: గొప్పలు చెప్పారు.. గుంతలు లేని దారులు అన్నారు.. చివరికి మళ్లీ పరిస్థితి మొదటికే తెచ్చారు. కూటమి ప్రభుత్వంలో రోడ్లపై ప్రయాణం ప్రజలకు నరకాన్ని చూపిస్తోంది.. కొత్త ప్రభుత్వం వచ్చాక కొత్తగా రోడ్లు వేయడం కాకుండా, గుంతలు పూడ్చడానికి నిధులు మంజూరు చేసింది. అదీ నామమాత్రంగా చేపట్టడంతో పరిస్థితి యథావిధిగా ఉంది. రాళ్లు తేలిన దారుల్లో ప్రయాణం నరకం కనిపిస్తోంది. కాకినాడ నగరం, రూరల్ ప్రాంత ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే కుంభాభిషేకం రోడ్డు దుస్థితిని మాత్రం మార్చలేకపోయింది. పండగ ముందు మమ అన్నట్టుగా రెండు రోజుల పాటు రాత్రిపూట తారు కలిపిన కంకరను తీసుకువచ్చి చిన్నపాటి గతుకుల్లో వేశారు. తరువాత ఎవరూ కనిపించలేదు. పండగ ముగిసింది. గతుకులు మాత్రం అలానే ఉండిపోయాయి.

కాకినాడ డైరీఫారమ్ సెంటర్ నుంచి పోర్టులకు వెళ్లే ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న కుంభాభిషేకం రోడ్డుపై చిన్నచూపు కారణంగా రాకపోకలు సాగించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో ప్రజలతో పాటు పలు పరిశ్రమల్లో పని చేసే వారు, సీ పోర్టు, యాంకరేజ్ పోర్టులకు వెళ్లే వారితో పాటు మత్స్యకారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పెద్ద పెద్ద గుంతలతో రోడ్డు పాడవ్వడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రహదారిలో ఉన్న గోడౌన్ల నుంచి పోర్టుకు బియ్యం లోడుతో నిత్యం లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో పెద్ద గొయ్యిల్లో పడి అవి పక్కకు ఒరిగిపోతుండడంతో పక్కనే ప్రయాణం సాగించే ద్విచక్ర వాహనదారులు హడలిపోతున్నారు. కుంభాభిషేకం రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కూటమి ప్రజాప్రతినిధుల దృష్టికి రోడ్డు సమస్యను అనేక దఫాలుగా మత్స్యకారులతో పాటు చాలా మంది తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. రహదారి నిర్మాణ బాధ్యతలను చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులను స్థానికులు కోరుతున్నారు.

అక్కడా అంతే..

మరోవైపు కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో సుమారు 120 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ, 50 కిలోమీటర్ల మేర పంచాయతీ రాజ్ రోడ్లు విస్తరించి ఉన్నాయి. ఆయా రహదారుల్లో గుంతలు పూడ్చివేత పనులు పూర్తిగా చేపట్టలేదు. కాకినాడ రూరల్, కరప మండలాల పరిధిలో రహదారుల్లో పూర్తిగా గతుకులు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. కాకినాడ నుంచి పిఠాపురం వెళ్లే మార్గంలో రాయుడుపాలెం జంక్షన్ సమీపంలో రోడ్డుకు మధ్యలో పెద్ద గోతులు ఏర్పడినా వాటిని కనీసం పూడ్చలేదని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని అంటున్నారు.

పూర్తిస్థాయిలో నిర్మించాలి



రోడ్లపై గతుకులు ఎక్కువగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించాలి. ఎక్కువగా మత్స్యకారులు ఈ మార్గం నుంచే కుంభాభిషేకం రేవు వద్దకు వెళ్తారు. వారి బాధలు అర్థం చేసుకోవాలి.

–వాసుపల్లి కృష్ణ, మత్స్యకార నాయకుడు, దుమ్ములపేట

మల్టీ సర్వీస్ సెంటర్ ప్రారంభం



వీల్ చైర్లను అందిస్తున్న లయన్స్‌క్లబ్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్, బాదం బాలకృష్ణ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ సభ్యుడు వీఎస్ఆర్ మూర్తి, నాగిని, బాబ్జీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అభినవ సహస్ర లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్‌ను క్లబ్ గవర్నర్ లయన్ ఈశ్వర్‌కుమార్, లయన్ బాదం బాలకృష్ణ సోమవారం ప్రారంభించారు. అధునాతన సదుపాయాలతో నిర్మించిన భవనం అందుబాటులోకి రావడం పట్ల కాకినాడ, రూరల్ ప్రాంతాల్లోని లయన్స్ క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లయన్ కొప్పర్తి సాయికృష్ణ సహాయంతో సుమారు రూ.1.30 లక్షల విలువైన 10 వీల్ చైర్లు, హెచ్ఐవీ బాధితులకు దుప్పట్లు, 15 టీ గార్డ్స్, టైలర్‌కు కుట్టుమిషన్ పంపిణీ చేశారు. అలాగే జీజీహెచ్‌కు రెండు స్ట్రెక్చర్లు, ఉమామనో వికాస కేంద్రం విద్యార్థులకు నిత్యావసర సరకులు అందజేశారు. హాజరైన వారందరికి లయన్ డాక్టర్ గరికిపర్తి నమశ్శివాయ భోజన సదుపాయం కల్పించారు. లయన్ విశ్వేశ్వరరావు, వజ్రపు కోటేశ్వరరావు, చిత్తులూరి రాజా, చిట్నీడి శ్రీనివాస్, పద్మ తులసి, ఎండీ షర్మిల, ఇంద్రగంటి నాగేశ్వరి, గరికిపర్తి నాగమణి, ఐ.ప్రసాద్‌నాయుడు, ఇంద్రగంటి శ్రీనివాస్, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'వేల గొంతులు' విజయవంతానికి పిలుపు



కాకినాడలో మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకుల సంబరాలు

కాకినాడ సిటీ: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే లక్ష డప్పులు, వేల గొంతులు కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి డప్పు కళాకారులు హాజరు కావాలని మహాజన సోషలిస్ట్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం కాకినాడ ధర్నా చౌక్ పార్కులో మహాజన సోషలిస్ట్ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ లక్ష డప్పుల కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్, ఎంఎల్ఎఫ్, ఎంఎంఎస్ అనుబంధ విభాగాల నుంచి వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగ చేసిన సేవలను గుర్తించి పద్మశ్రీ అవార్డు ప్రకటించడం గర్వకారణమని అన్నారు. పిట్ట వరప్రసాద్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇవ్వడం దళిత వర్గాల్లో చాలా ఆనందోత్సవాలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ముందుగా ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్ మాదిగ, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా, నాయకులు దూలపల్లి వెంకటరమణ, పి.వెంకటరావు, ఏసు, దూలపల్లి రవి, దూలపల్లి కృష్ణ, నరుకుర్తి రాజు, తుమ్మలపల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల గోల్డెన్ జూబ్లీ వేడుకలు



ఎంఎస్ఎన్ చారిటీస్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురంలోని ఎంఎస్ఎన్ చారిటీస్‌లో 1974– 75లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల గోల్డెన్‌జూబ్లీ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్, విశాఖపట్నంతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 100 మందికి పైగా మిత్రులు ఈ గోల్డెన్‌జూబ్లీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన వేడుకలు మధ్యాహ్నం వరకూ ఎంతో ఉత్సాహంగా సాగాయి. ఇటీవల మరణించిన కంకణంపాటి వెంకట రవి, బత్తుల రాజేంద్రల ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మిత్రులు మౌనం పాటించారు. ప్రతి ఏడాది వేడుకలు జరుపుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమానికి వచ్చిన మిత్రులకు 50 ఏళ్ల జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో డాక్టర్ భగవాన్, అలీ, తటవర్తి సుబ్బారావు, దేశిశెట్టి దుర్గాప్రసాద్, సుంకర ఈశ్వర్‌ప్రసాద్, పెండెం సత్యనారాయణ, లక్ష్మం జయదేవ్, గోపరాజు శ్రీనివాస్, చొడిపల్లి కాశీరావు, వేణురాజు, నున్న గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టి



క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఐఐపీటీ డైరెక్టర్ కృష్ణ

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే కళాశాలతో పాటు అనుబంధ కళాశాల విద్యార్థులకు పట్టాతోపాటు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఐఐపీటీ డైరెక్టర్ బత్తుల తిరుమల కృష్ణ అన్నారు. స్థానిక జేఎన్‌టీయూలో సోమవారం వర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలలో అభ్యర్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిటోరియంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకుని పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రతి నెలా 2 నుంచి మూడు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించేలా కంపెనీ ప్రతినిధులతో సంప్రదిస్తున్నామన్నారు. ఈ ఇంటర్వ్యూలకు 120 మంది హాజరుకాగా మెకానికల్ ఏడుగురు, కెమికల్ పది, కెమిస్ట్రీ 9 మంది, హెల్త్‌సేఫ్టీ ఒకరిని ఎంపిక చేశారు. అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించిన సాయిపవర్ ఎక్విప్‌మెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ సాయిపవార్, గోపిలు వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్ హెచ్‌ఆర్ రిచర్డ్, ప్లేస్‌మెంట్ ఫోకస్ పొండర్ మనోజ్‌కుమార్, టెక్నికల్ మేనేజర్ షేక్‌మహ్మద్ నసీరుద్దీన్ పాల్గొన్నారు.

వైద్యాధికారులకు సత్కారం





డాక్టర్లు శ్రీనివాసన్, విఠల్, లావణ్య కుమారిలను సత్కరిస్తున్న అసోసియేషన్ బృందం

కాకినాడ క్రైం: రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న జీజీహెచ్ అధికారులను ఆసుపత్రి మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సోమవారం స్థానిక జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్‌లు సత్కారం అందుకున్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, మినిస్టీరియల్ కార్యదర్శి వై.సత్యనారాయణ, సహాయ అధ్యక్షుడు కొండేపూడి శేఖర్, ఏడీ అనురాధ, అకౌంటెంట్ సుబ్రహ్మణ్యం, టీఎస్ఎల్ఎస్ మూర్తి, రమేష్, కిశోర్ బేబి, రాధాదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి



సంగీత కచేరి చేస్తున్న మహాదాసు శ్యామ నీలాద్రిరావు

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి గానసభల్లో భాగంగా సోమవారం రాత్రి స్థానిక జేఎన్‌టీయూకే అల్యూమినియం ఆడిటోరియంలో నిర్వహించిన మహాదాసు శ్యామ నీలాద్రిరావు ఫ్యూషన్ సంగీత కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. శాస్త్రీయ సంగీతంతోపాటు భక్తి సంగీతం ఎలా కంపోజ్ చేస్తారనే విషయాలను తెలిపారు. అనేక మంది వాగ్గేయకారుల కీర్తనలు, భక్తిగీతాలు, సినీ గీతాలు వాయించి అందరినీ మైమపింపారు. వీరికి మృదంగంపై మహాదాసు ఏడుకొండలు, కీబోర్డుపై సీహెచ్ ప్రవీణ్, రిథమ్ పేడ్స్‌పై జి.బాబూరావు చక్కటి సహకారాన్ని అందించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూకే వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.దీక్షితులు ప్రారంభించారు. అనంతరం వీసీ మురళీకృష్ణ మహాదాసు శ్యామ నీలాద్రిరావును సత్కరించారు. ఎంవీజీ కృష్ణంరాజు, నల్లమిల్లి మణిబాబు, అనంత్, వక్కలంక రామకృష్ణ, గట్టి శ్రీకృష్ణదేవ రాయలు, చావలి సూర్యకుమారి పాల్గొన్నారు.

కోతుల బెడద నివారణకు వినతి



కోతుల బెడదపై డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



గొర్రిపూడిలో ఎత్తిపోతల పథకం వద్ద రైతులతో చర్చిస్తున్న అధికారులు

కాకినాడ సిటీ: స్థానిక 37వ డివిజన్ కచేరిపేట, అంబేడ్కర్ భవన్ పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద నివారించాలని సోమవారం సీపీఎం కచేరిపేట శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ చాలా కాలంగా 37వ డివిజన్‌లో కోతులతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వండిన ఆహార పదార్థాలను కోతులు తీసుకుపోతున్నాయన్నారు. నగరపాలక సంస్థ పాలక వర్గం ఉన్నప్పుడు కోతుల సమస్యపై చర్చ కూడా జరిగిందన్నారు. అయినా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా కోతుల బెడద నివారించాలని కోరారు. దీనిపై డీఆర్వో వెంకట్రావు స్పందిస్తూ అటవీ అధికారులను పిలిచి కోతులను ఏజెన్సీ ప్రాంతానికి తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఎం కచేరిపేట శాఖ కార్యదర్శి కె.నాగజ్యోతి, సభ్యులు భూలక్ష్మి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలని..

కరప: గొర్రిపూడిలోని శ్రీరాజశేఖర పరస్పర సహకార ఎత్తిపోతల పథకానికి సంబంధించిన 2 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు అపహరణకు గురయ్యాయని, సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ షన్మోహన్‌ను రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, గొర్రిపూడి నీటి సంఘం అధ్యక్షుడు జోకా అప్పలరాజు తదితరులు రైతులతో కలసి వినతిపత్రం అందజేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని కోరారు. కొంగోడు, వేములవాడ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన సమస్యలను కూడా కలెక్టర్‌కు వివరించారు.

ఎత్తిపోతల పథకం పరిశీలన

గొర్రిపూడిలో శ్రీరాజశేఖర పరస్పర సహకార ఎత్తిపోతల పథకాన్ని అధికారులు పరిశీలించారు. రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను దొంగించడంతో కొత్తవి మంజూరు చేయాలని కలెక్టర్‌కు రైతులు వినతిపత్రం ఇవ్వగా, ఆయన స్పందించి ఆయా శాఖల అధికారులను నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో సాయంత్రం విద్యుత్ శాఖ ఏడీఈ టి.విష్ణుమూర్తి, ఏఈ సానా ఈశ్వరప్రసాద్, రాజమహేంద్రవరం లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు సురేంద్ర, గురవయ్య, ఇరిగేషన్ డీఈఈ అనంతకుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏ కె.బాబూరావు, తాళ్లరేవు ఎంఏఓ ప్రశాంతి తదితరు ఈ పథకాన్ని పరిశీలించి, నీటి సంఘ అధ్యక్షుడు జోకా అప్పలరాజు ఇతర రైతులతో చర్చించారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని అధికారులు తెలిపారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా బందోబస్తు



మొండి వద్ద సీఐ, ఎస్సైలతో కలసి స్నానాల రేవును పరిశీలిస్తున్న ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్

కరప: చొల్లంగి అమావాస్య తీర్థంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన బందోబస్తు నిర్వహించాలని కాకినాడ సబ్ డివిజన్ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆదేశించారు. మండలంలోని ఉప్పలంక శివారు మొండి వద్ద ఈ నెల 29న జరిగే చొల్లంగి తీర్థం ఏర్పాట్లను పరిశీలించారు. రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కరప, కోరంగి ఎస్సైలు టి.సునీత, సత్యనారాయణరెడ్డిలతో బందోబస్తు నిర్వహణపై చర్చించి, పలు సూచనలు చేశారు. స్నానాల రేవును పరిశీలించి, భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని, గజ ఈతగాళ్లను అక్కడ ఉంచాలన్నారు. దొంగతనాలు జరగకుండా, ఆకతాయిలు తిరగకుండా చూడాలన్నారు. సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద క్యూలైన్ వద్ద తొక్కిసలాట జరగకుండా, ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. వాహనాల రాకపోకలతో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తగిన పర్యవేక్షణ చేయాలన్నారు. ట్రాఫిక్ మళ్లింపు తదితర అంశాలపై ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ సూచనలిచ్చారు. యానాం వైపు నుంచి వచ్చే వాహనాలను వేమవరం, గొర్రిపూడి, పెనుగుదురు మీదుగా కాకినాడ వెళ్లేందుకు, కాకినాడ వైపు నుంచి యానాం వైపు వెళ్లే వాహనాలు తూరంగి, నడకుదురు, గురజానపల్లి మీదుగా యానాం రోడ్డుకు వెళ్లేలా మంగళవారం అర్ధరాత్రి నుంచి ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు సీఐ చైతన్యకృష్ణ వివరించారు. స్నానాల రేవు, ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లను ఎంఎస్ఎన్ చార్టీస్ అసిస్టెంట్ కమిషనర్ కె.వి జయలక్ష్మి వివరించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ భావన తెలిపారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 మంది వివిధ సమస్యలపై కమిషనర్‌కు వినతులు అందజేశారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, పారిశుధ్య విభాగాలకు సంబంధించి 32 మంది వివిధ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వివిధ సమస్యలను క్షేత్రస్థాయిలో కమిషనర్ పరిశీలించారు. బాలాజీచెరువు సెంటర్‌లో డంపర్ బిన్‌లను, జగన్నాథపురం అన్నమ్మఘాటీ ప్రాంతంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట అదనపు కమిషనర్ సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్ తదితరులు ఉన్నారు.

మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించండి



సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేస్తున్న సంఘ సభ్యులు

కాకినాడ సిటీ: చేపల మార్కెట్‌లో సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల మత్స్య కార్మికుల సంఘం డిమాండ్ చేసింది. కాకినాడ రాజాజీ వీధిలోని పెద్ద మార్కెట్‌లో చేపల విక్రయాల వద్ద సమస్యలను పరిష్కరించాలని సోమవారం నగరపాలక సంస్థ గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేసినట్లు సంఘ నాయకులు ఉప్పాడ సత్యనారాయణ, పి.దుర్గాదేవి, సీహెచ్ రమణిలు విలేకర్లకు తెలిపారు. ఇరువైపులా అల్యూమినియం షాపులు ఉండేలా మధ్యలో మార్కెట్ బోర్డుతో మార్కెట్ కనబడేలా చర్యలు చేపట్టాలని కోరామన్నారు. కొనుగోలుదారులకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, మహిళలకు మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. మార్కెట్ చుట్టూ రక్షణగా ఉండే విధంగా ఇనుప మెస్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలపై స్పందించిన కమిషనర్ పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. సంఘ నాయకులు టి.దుర్గాదేవి, హరమ్మ, సత్యవతి, నూకాలమ్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కాకినాడ క్రైం: ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక సూర్యనారాయణపురానికి చెందిన గుండ్రాసి సాయికుమార్ (25) మద్యానికి బానిసయ్యాడు. ఇక్కడి పోర్టులో పనిచేస్తూ నిత్యం మద్యం తాగేవాడు. మద్యం మత్తులో తల్లిని కొట్టేవాడు. ఈ క్రమంలో 25న తల్లితో ఘర్షణ పడి ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కాకినాడ త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.